క్లుప్తంగా

నేడు లక్ష దీపోత్సవం

ఆనందపురం : మండలంలోని గంభీరంలో ఉన్న హరేకృష్ణ వైకుంఠంలో మంగళవారం లక్ష దీపోత్సవం నిర్వహించనున్నట్టు ప్రెసిడెంట్ నిష్కించిన భక్తదాస తెలిపారు. సాయంత్రం 6 గంటలకు హారతి, సంకీర్తన, ప్రవచనం, 7 గంటలకు దామోదర హారతి, లక్ష దీపోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు పాల్గొని స్వామి కృప పొందాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం

తగరపువలస: వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక గ్రంథాలయ వీధిలో అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను జోన్ ఏపీడీ సంతోష్ ఆధ్వర్యంలో వివరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చిప్పాడ వెంకటేష్, తెడ్లాపు అప్పలరాజు, బీజేపీ రాష్ట్ర కోశాధికారి ఎం.నాగేంద్ర, భీమిలి కన్వీనర్ కె.రామానాయుడు, వాసుపల్లి శ్రీహరి, అయినాడ మాధవ, శీరపు రామలక్ష్మి, పంపాన సుబ్రహ్మణ్యం, గందసిరి రాజన్న తదితరులు పాల్గొన్నారు.

39 మందికి వైద్య పరీక్షలు

ఆనందపురం : ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో గర్భిణులను పరీక్షించారు. ప్రసూతి వైద్య నిపుణురాలు డాక్టర్ ఎం.రత్నావలి పర్యవేక్షణలో పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి సహనాజ్ సాధియా 39 మంది గర్భిణులకు హెచ్‌బీ, బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు గంగునాయుడు, సామాజిక ఆరోగ్య అధికారి సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సాగరతీరంలో ఆత్మీయ కలయిక



ఆత్మీయ సమావేశంలో కలుసుకున్న అలనాటి స్నేహితులు

కొమ్మాది: సాగరతీరం అలనాటి స్నేహితుల అపూర్వ కలయికకు వేదికగా మారింది. సాగర్ నగర్‌లోని ఓ రిసార్ట్‌లో సెయింట్ ఆంథోని హైస్కూల్‌లో 1985 బ్యాచ్ స్నేహితులు 120 మంది కలుసుకున్నారు. విద్యార్థి దశ నాటి విషయాలు, సాధించిన విజయాలు నెమరు వేసుకుంటూ యోగ క్షేమాలతో, పలకరింపులతో పులకరించిపోయారు. ఈ సందర్భంగా అప్పుడు చదువు నేర్పిన రత్నారెడ్డి మాస్టారును సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పి.వెంకటేశ్వరరావు, ఎ.దినకర్, డాక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన విద్యార్థి మృతి



పొన్నగంటి హరి (ఫైల్)

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ కురపల్లి సమీప చెక్ డ్యామ్ వద్ద గోస్తనీ నదిలో గల్లంతైన ఇంటర్ విద్యార్థి పొన్నగంటి హరి (16) సోమవారం సాయంత్రం శవమై తేలాడు. పీఎంపాలెం గాయత్రినగర్‌కు చెందిన హరి (16) తోటి సేహితులతో స్నానం చేయడానికి ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలకు చెక్ డ్యామ్ వద్ద గోస్తని నదిలోకి దిగి గల్లంతయ్యాడు. అప్పటి నుంచి ఆచూకీ కోసం స్థానిక జాలర్లు నదిలో గాలించారు. అయినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో ఎస్‌డీఆర్‌ఎఫ్ బలగాలు సోమవారం మధ్యాహ్నం రంగ ప్రవేశం చేసి గోస్తనీ నదిలో గాలింపు చర్యలు చేపట్టగా సాయంత్రం 5 గంటలకు... స్నానానికి దిగిన ప్రాంతంలోనే బురదలో కూరుకుపోయిన హరి మృతదేహం లభించింది. అనంతరం పోస్టుమార్టం కోసం భీమునిపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ చెక్‌డ్యామ్ పరిసరాల్లో ఇప్పటి వరకూ ఐదుగురు చనిపోయారని, ఇది మృత్యుకుహరంగా మారిందని స్థానికులు అంటున్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

భీమునిపట్నం: భీమిలి మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు సకాలంలో అధికారులు పూర్తి చేయాలని ఎంపీపీ దంతులూరి వాసురాజు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సోమవారం నిర్వహించిన సమీక్షలో ఆయన పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూసుకోవాలని, ఈ విషయంలో ఎవరూ రాజీ పడొద్దన్నారు. ఎక్కడైనా పనులు సరిగ్గా జరగకపోతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా అధికారులు సమన్వయంతో పనులు చేసుకోవాలని, అప్పుడే అన్నీ సక్రమంగా జరుగుతాయన్నారు. ఎంపీడీవో డాక్టర్ వి.జానకి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ స్వచ్ఛ జలం

జల్ జీవన్ మిషన్ పనులతో తప్పిన తాగునీటి కష్టాలు



అమనాంలో పైప్‌లైన్ నిర్మాణానికి మెటీరియల్



ఇది కదా అభివృద్ధి

తగరపువలస: గత ప్రభుత్వాల హయాంలో గ్రామీణులు తాగునీటి కోసం అష్టకష్టాలు పడేవారు. బిందెపై బిందె పెట్టుకుని ఊరి అవతల వ్యవసాయ బావులు, బోర్ల వద్దకు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లేవారు. గ్రామ పంచాయతీల్లో అరకొర వసతులతో రక్షిత మంచినీటి పథకాలు పేరుకే ఉండేవి. విద్యుత్ సరఫరా లేకపోవడం, ట్యాంకులు శుభ్రం చేయకపోవడం, నీటిని విడుదల చేసే ఆపరేటర్లు లేకపోవడం వంటి లోపాలతో తాగునీటి సమస్య ఎక్కువగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టణాలతో సమానంగా గ్రామీణ ప్రాంతాలకు సురక్షితమైన తాగునీటి సరఫరాపై దృష్టి సారించింది. జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ కుళాయిలు నిర్మించి మహిళలకు ఇబ్బంది కలగకుండా తాగునీటి సరఫరాకు ప్రభుత్వం జలయజ్ఞం మొదలు పెట్టింది. ఇందులో భాగంగా కొత్తగా ఓవర్‌హెడ్ ట్యాంకులు, బోరుబావులు, పైప్‌లైన్లు, ఇంటింటికీ వ్యక్తిగత కుళాయి కనెక్షన్లు నిర్మిస్తున్నారు. బోరుబావులు పనిచేయని చోట పక్క గ్రామం నుంచి నీటిని తరలిస్తున్నారు.

64 పంచాయతీల్లో 2.23 లక్షల మందికి ప్రయోజనం...

భీమిలి నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 64 గ్రామ పంచాయతీలకు చెందిన 2,23,736 మంది ప్రజలు జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రయోజనం పొందనున్నారు. ఇప్పటికే చాలా వరకు ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం, పైప్‌లైన్లు పూర్తికాగా, కొన్ని చోట్ల నిర్మాణదశలో ఉన్నాయి. వీటిని రెండు దశల్లో పూర్తి చేసేలా కాంట్రాక్టర్లకు అప్పగించారు. ఇందులో కొన్ని పనులు తుదిదశలో ఉండగా మరికొన్ని నిర్మాణంలో ఉన్నాయి.

- భీమిలి మండలంలో రూ.18.47 కోట్లతో 105 చోట్ల పనులు జరుగుతున్నాయి.
- ఆనందపురం మండలంలో రూ.32.08 కోట్లతో 153 చోట్ల పనులు చేస్తున్నారు.
- పద్మనాభం మండలంలో రూ.17.81 కోట్లతో 89 పనులు చేస్తున్నారు.
- భీమిలి మండలం అమనాంలో రూ.2.31 కోట్లు, అన్నవరంలో రూ.41.70 లక్షలు, బోడమెట్టపాలెంలో రూ.16.60, చిప్పాడలో రూ.1.41 కోట్లు, దాకమర్రిలో రూ.1.38 కోట్లు, లక్ష్మీపురంలో రూ.1.06 కోట్లు, మజ్జిపేటలో రూ.61.44 లక్షలు, మజ్జివలసలో రూ.58.04 లక్షలు, మూలకుద్దులో రూ.91.22 లక్షలు, పెదనాగమయ్యపాలెంలో రూ.51.69 లక్షలు, తాళ్లవలసలో రూ.1.72 కోట్లు, టి.నగరపాలెంలో రూ.84.86లక్షలు, తాటితూరులో రూ.1.41 కోట్లు, శింగనబందలో రూ.59.36 లక్షలు, నారాయణరాజుపేటలో రూ.28.60 లక్షలు, రేఖవానిపాలెంలో రూ.67.06 లక్షలతో జల్ జీవన్ మిషన్ పనులు జరుగుతున్నాయి.



జీరుపేటలో నిర్మిస్తున్న వాటర్ ట్యాంకు



అమనాంలో నిర్మిస్తున్న ఓవర్‌హెడ్ ట్యాంకు



నరసయ్యపేటలో ఇంటింటికీ కుళాయిలు బిగిస్తున్న టెక్నీషియన్



మజ్జివలస ఎస్సీ కాలనీలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు



మజ్జివలసలో ఇంటింటికీ పైప్‌లైన్ సిద్ధం



సిటీనగర్‌లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ల కోసం వేసిన పైప్‌లైన్

ఊరి అవతలికి వెళ్లేవాళ్లం



గతంలో తాగునీటి కోసం బిందెలు పట్టుకుని ఊరు అవతలి ట్యాంకులు, వ్యవసాయ భూముల్లోకి వెళ్లేవారం. ఇంటికి నీరు మోసుకుని రావడానికి కష్టంగా ఉండేది. ఇప్పుడు ఇంటి ముందుకే కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. సీఎం జగన్ దయ వల్ల ప్రశాంతంగా తాగునీరు పట్టుకుంటున్నాం.

– మల్లిపూడి దుర్గ, జీరుపేట

ఇంట్లో మగవారికీ పని...



నీళ్ల కోసం మహిళలమే కాకుండా ఇంట్లో మగవారు కూడా కావిళ్లతో నీరు మోస్తుండేవారు. మహిళలకు నెత్తిపై భారం, పురుషులకు జబ్బలు పులిసిపోయేవి. నీటి కోసం ఇంటిల్లపాదీ ఇబ్బంది పడాల్సి వచ్చేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఆ బాధ తప్పింది.

– చందక నరసయ్యమ్మ, నరసయ్యపేట

ప్రస్తుతం సరిపడా నీరు



గతంలో నీటి కోసం దూరంగా వెళ్లేవారం. ఇప్పుడు మా ఇళ్లకు చేరువలోనే ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించి, ఇంటికి కుళాయి కనెక్షన్లు ఇస్తున్నారు. తాగునీరు, వాడుక నీరు సమస్యలు తొలగించిన మా మంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి. ఆయనకు రుణపడి ఉంటాం.

– చెన్నా మంగమ్మ, అమనాం

ముఖ్యమంత్రి మహిళా పక్షపాతి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దేశంలో మిగిలిన సీఎంలతో పోలిస్తే మహిళా పక్షపాతి. అడగకుండానే ఈ అయిదేళ్లలో మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అందించారు. ఇప్పుడు ప్రాణాధారమైన తాగునీరు అందిస్తున్నారు. సీఎం జగన్ మేలు ఎప్పటికీ మరిచిపోలేం.

– కొయ్య చిన్న, జీరుపేట

జాతీయ తైక్వాండో పోటీల్లో ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న కోచ్, సహచర క్రీడాకారులు

మధురవాడ: జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో మధురవాడకు చెందిన పలువురు క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరిచారు. డిసెంబర్ 1 నుంచి 3 వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో జరిగిన సబ్ జూనియర్స్, క్యాడెట్ జాతీయ స్థాయి పోటీల్లో మధురవాడ క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరిచారు. ఈ పోటీలకు 10 మంది క్రీడాకారులు హాజరుకాగా ఏడుగురు పతకాలు సాధించారు. జి.భాషిత, కె.ధనలక్ష్మి బంగారు పతకాలు, పి.జ్ఞానసిరి వెండి పతకం, పి.జశ్వంత్, డి.నాగ్ చరణ్, ఎ.నిత్యశ్రీ, ఎం.గాయత్రి కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. విజేతలకు యూత్ తైక్వాండో కోచ్ సురేష్, రాష్ట్రం తరపున కోచ్‌గా వ్యవహరించిన కె.సుకుమార్ సంపత్, పెద్దలు కొర్రాయి సురేష్ తదితరులు అభినందనలు తెలిపిపారు.

సీఎం జగన్ పాలనలో అందరికీ మేలు



మధురవాడలో సర్వే సామగ్రి అందజేస్తున్న నాయకులు

మధురవాడ: పేదలకు నిత్యం అండగా ఉండేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాత్రమేనని పలువురు నాయకులు అన్నారు. సంక్షేమ పథకాలు, ఇంటి వద్దకే అందిస్తున్నారన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం జీవీఎంసీ 7వ వార్డు మధురవాడ వాంబేకాలనీలో సోమవారం సాయంత్రం నిర్వహించారు. ముందుగా సంక్షేమ పథకాల ఫ్లెక్సీలు, వైఎస్సార్ సీపీ పతాకాన్ని క్లస్టర్ ఇన్‌చార్జి పోతిన శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ కుడితి రామారావు, నాయకులు వేగి రామిరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికలు దగ్గర పడుతుండడంతో మళ్లీ కల్లబొల్లి కబుర్లు చెప్పడానికి టీడీపీ, జనసేన నాయకులు వస్తారని, వారి మాయ మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. అన్ని వర్గాలకు మేలు చేస్తున్న సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు అందరూ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కన్వీనర్లు పుక్కెళ్ల ఎల్లాజీ, నాయిని రాజు, కె.తారక్ నాగేంద్ర, కె.గోవింద్, మంగమ్మ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు పెంద్ర అప్పన్న, శ్రీశైన కార్పొరేషన్ డైరెక్టర్ నారాయణమ్మ, నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో మార్మోగిన శివనామస్మరణ



శివయ్య సన్నిధిలో వెంకటరామయ్య, తదితరులు



పూజలందుకున్న శివయ్య

తగరపువలస: కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. పలు ఆలయాలలో భక్తులు శివలింగానికి పంచామృతాలతో అభిషేకాలు జరపించారు. భీమిలి మండలం పాత మూలకుద్దులో అర్చకుడు మహా రుద్రాభిషేకం నిర్వహించారు. సంగివలసలోని పురాతన ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో వేకువజాము నుంచే భక్తులు క్యూ కట్టారు. అర్చకులు నాగశర్మ, రంజిత్‌శర్మ ఆధ్వర్యంలో మహాదేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిట్టివలస, కొండపేట, బసవపాలెం, బంగ్లామెట్ట, సత్యనారాయణపేట, లక్ష్మీపురం, తాటితూరు, తాళ్లవలస శివాలయాల్లో పూజలు చేశారు.

కొమ్మాది: కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో శివాలయాలన్నీ ఓం నమఃశివాయ నామంతో మార్మోగాయి. వేకువజాము నుంచే శివయ్యను పూజించేందుకు భక్తులు బారులు తీరారు. బీచ్ రోడ్డు హంసవనం పుణ్యక్షేత్రం రామాద్రిలో, ఎండాడ, రుషికొండ శివాలయాల్లో, మారికవలస శివాలయాల్లో భక్తులు పంచామృతాభిషేకాలు నిర్వహించి, దీపారాధన చేశారు.

మధురవాడ: మిథిలాపురి వుడా కాలనీలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో దేవదాయ శాఖ ఈవో బుద్ద లక్ష్మీ నగేష్ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు దొంతుకుర్తి సుబ్రహ్మణ్య శర్మ, ఇతర అర్చక బృందం పూజలు చేశారు. మధురవాడ జంక్షన్‌లోని సిద్ధేశ్వర స్వామి పీఠంలో ధర్మకర్త నరసింహమూర్తి, కమిటీ సభ్యులు సతీష్, నాగోతి సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో దూసి రామలింగస్వామి ప్రత్యేక పూజలు చేశారు.

భీమునిపట్నం: స్థానిక చోడేశ్వర స్వామి దేవాలయాన్ని గతంలో భీమిలి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన వెంకటరామయ్య కుటుంబ సభ్యులతో సోమవారం దర్శించుకున్నారు. 2001లో కమిషనర్‌గా ఆయన పనిచేయగా ప్రస్తుతం విజయవాడ సచివాలయంలో ఓఎస్‌డీగా పని చేస్తున్నారు. ఆయనకు వైఎస్సార్‌సీపీ 3వ వార్డు ఇన్‌చార్జి మైలిపల్లి షణ్ముఖరావు స్వాగతం పలికారు. అర్చకులు సుబ్రహ్మణ్యం ప్రత్యేక పూజలు చేశారు.

పీఎం పాలెం: కారుషెడ్ కూడలిలోని శ్రీ కాశీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు చేశారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. బక్కన్నపాలెం రోడ్డులో ఉన్న శ్రీ శృంగేరీ శంకర మఠంలో గల శ్రీ ఉమా సిద్ధేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక రుద్రాభిషేకం చేశారు.

కళలను ప్రోత్సహించాలి



గెలుపొందిన విద్యార్థినికి జ్ఞాపిక, ప్రశంస పత్రాలను అందజేస్తున్న జ్యోతికుమారి

భీమునిపట్నం: మన భారత దేశంలో నృత్య కళలకు ఎంతో ప్రాముఖ్యం ఉందని ఆర్‌జేడీ ఎం. జ్యోతికుమారి అన్నారు. సోమవారం జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్) వద్ద విశాఖ ఉమ్మడి జిల్లాల కళా ఉత్సవ్ పోటీలను ఆమె ప్రారంభించారు. పాశ్చాత్య సంస్కృతి ప్రభావం వల్ల రానురాను మన కళలపట్ల ఆదరణ తగ్గిపోతోందని ఇది సరైనది కాదన్నారు. పిల్లలకు తప్పనిసరిగా అన్ని రకాల కళలను నేర్పించాల్సిన బాధ్యత తల్లితండ్రులపై వుందన్నారు. డైట్ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ మాట్లాడారు. ప్రస్తుతం 18 పాఠశాలల నుంచి 85మంది విద్యార్థులు కళా ఉత్సవ్‌లో పాల్గొన్నారు. సోమవారం నాటి పోటీల్లో గెలిచిన విద్యార్థినులకు ఆర్‌జేడీ జ్యోతికుమారి బహుమతులు, ప్రశంస పత్రాలను అందజేశారు.

ఘనంగా క్రిస్మస్ వేడుక



కార్యక్రమంలో పెద్దలను సత్కరిస్తున్న సభ్యులు

భీమునిపట్నం: స్థానిక వైఎంసీఏ ఆధ్వర్యంలో యునైటెడ్ క్రిస్మస్ వేడుక ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రెవరెండ్ శామ్యూల్ కర్నోజి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు భూమిపైకి వచ్చి అందరికీ రక్షకుడిగా నిలిచారన్నారు. పాస్టర్ రాజ్‌కుమార్ బృందం చక్కటి సంగీతాన్ని అందించారు. విశాఖకు చెందిన రాజ్‌కుమార్ బృందం క్రీస్తు జననం నాటికను ప్రదర్శించారు. అనంతరం వైఎంసీఏ అధ్యక్షుడు కె.ఎస్.ఎం.సుధాకర్ ఆధ్వర్యంలో సభ్యులు పెద్దలను సత్కరించారు. పాస్టర్లు గిడియన్ విజయకుమార్, విలియమ్ సునీల్‌బాబు, స్టీఫెన్, ఫ్రాన్సిస్, ఆంథోని, ప్రభాకర్, సభ్యులు జె.ఆల్బర్ట్ సుదర్శన్, ఏసుదాసు, విలియం కేరి, ప్రేమానందరావు పాల్గొన్నారు.

కొత్తమ్మతల్లికి ప్రత్యేక అలంకరణ



గులాబీ, చామంతుల అలంకరణలో కొత్తమ్మతల్లి

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట కొత్తమ్మ తల్లిని సోమవారం గులాబీ, చామంతులతో అలంకరించారు. సంతపేట రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో భీమిలి మండలం చిప్పాడకు చెందిన సాడి కుమార్, తాళ్లవలసకు చెందిన బోని ఈశ్వర్‌కు మార్ అలంకరించారు. అలంకరణకు పెనుగుర్తి వెంకట సన్యాసిరావు, లోకేశ్వరి, తమలంపూడి నర్సిరెడ్డి, సాయిలక్ష్మి సహాయ సహకారాలు అందించారు.

వెనక్కి వెళ్లిన సముద్రం



సముద్రం వెనక్కి వెళ్లడంతో కనిపిస్తున్న రాళ్లు

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో సముద్రం ఒక్కసారిగా వెనక్కి వెళ్లింది. తుపాను నేపథ్యంలో కొన్ని రోజుల కింద ముందుకు వచ్చిన సముద్రం భారీ కెరటాలతో భయపెట్టింది. సోమవారం సాయంత్రం సముంద్రం వెనక్కి వెళ్లడంతో తీరం విశాలంగా మారింది. కొన్ని చోట్ల రాళ్లు బయటపడ్డాయి.

పైప్‌లైన్ నిర్మాణానికి రేపు భూమిపూజ

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లో తాగునీటి సమస్య పరిష్కారంలో భాగంగా రూ.1.20 కోట్లతో చేపట్టనున్న పైప్‌లైన్ నిర్మాణానికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు బుధవారం భూమి పూజ చేయనున్నారు. ఇందుకోసం వినియోగించే పైపులు సోమవారం చిట్టివలస బంతాట మైదానానికి లారీలతో చేరుకున్నాయి. ఇటీవల పైప్‌లైన్లు పగిలిపోవడంతో పనులు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయ్ చందర్

కొమ్మాది: మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అని రాష్ట్ర మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయ్ చందర్ అన్నారు. జీవీఎంసీ 4వ వార్డు ఉప్పాడలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెల 21న మత్స్యకార దినోత్సవం సందర్భంగా నిర్వహించాల్సిన సమావేశాన్ని హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాదం దృష్ట్యా వాయిదా వేసి ప్రస్తుతం నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మత్స్యకారులకు ఎంతో మేలు జరిగిందన్నారు. డీజిల్ సబ్సిడీ, వేట విరామ భృతి అందిస్తూ మత్స్యకారులకు అండగా నిలిచారన్నారు. హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో బాధితులకు 80 శాతం మేర నష్ట పరిహారం అందించి సీఎం జగన్ పెద్ద మనసు చాటుకున్నారని కొనియాడారు. సమావేశంలో మత్స్యకార సంఘ నాయకులు పాల్గొన్నారు.

పరిమళించిన మానవత్వం



సత్యం మృతదేహం వద్ద శ్రీనివాసరావు, తదితరులు

తగరపువలస: కొండపేట రహదారిలో మృతిచెందిన వ్యక్తికి స్థానికులు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. జీవీఎంసీ భీమిలి జోన్ 4వ వార్డు నేరెళ్లవలస కాలనీకి చెందిన పీతల సత్యం (37) అలియాస్ బ్లిస్ పదేళ్ల క్రితమే ఇంటిని విడిచి తగరపువలస వచ్చేశాడు. ఇక్కడ వివిధ షాపుల్లో పని చేస్తూ వారు పెట్టింది తిని రోడ్ల పక్కన నిద్రపోయేవాడు. ప్రస్తుతం కొండపేట రహదారిలో హోటల్‌లో పనిచేస్తూ సమీపంలోని పబ్లిక్ టాయిలెట్ల వద్ద ఉంటుండేవాడు. ఇటీవల కాలికి గాయమై, పెద్దతి కావడంతో సోమవారం వేకువజామున నిద్రలోనే టాయిలెట్ల బయట మృతిచెందాడు. స్థానికులు స్పందించి సత్యం అంత్యక్రియలకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. భీమిలి మండలం తాళ్లవలసకు చెందిన మందపాటి శ్రీనివాసరావు సత్యం మృతదేహాన్ని శ్మశానవాటికకు తరలించేందుకు లాస్ట్ జర్నీ వాహనాన్ని సమకూర్చారు. ఇతర ఖర్చులకు మరో రూ.2 వేలు అందించారు. వాహనం డ్రైవర్ ఒనుము కనకరాజు స్థానికుల సాయంతో గోస్తనీనది వద్ద తగరపువలస శ్మశాన వాటికలో తలకొరివి పెట్టాడు. సత్యం మరణ వార్త తెలుసుకున్న ఆయన భార్య గౌరి, పదో తరగతి చదువుతున్న కుమారుడు మహేష్ తదితరులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

పోలి పాడ్యమికి గోస్తనీ తీరంలో ఏర్పాట్లు



టి.నగరపాలెంలో గోస్తనీనది ఘాట్ వద్ద ఏర్పాట్లు

తగరపువలస: ఈ నెల 13న పోలి పాడ్యమి సందర్భంగా భీమిలి మండలం టి.నగరపాలెం గోస్తనీనది తీరంలో పంచాయతీ పాలకవర్గం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఆ రోజు వేకువజామున పెద్ద ఎత్తున మహిళలు నదీస్నానం ఆచరించి అరటి దువ్వలతో దీపాలు వదులుతారు. ఈ సందర్భంగా పంచాయతీ పాలకవర్గం ఘాట్ పరిసరాలతోపాటు నదిని శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. చెరువు అంచులలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. మహిళలు దుస్తులు మార్చుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు, టెంట్లు వేశారు. అనంతరం పూజా కార్యక్రమాల నిర్వహణకు వినాయకుడు, శివుడు విగ్రహాలతోపాటు శివలింగాన్ని ఏర్పాటు చేసినట్టు సర్పంచ్ పాట్నూరు ఛాయాగౌతమి, ఎంపీటీసీ సభ్యురాలు పల్లా నీలిమ తెలిపారు.

కేంద్రం కులగణన చేపట్టాలి



బీసీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గానికి నియామక పత్రం అందజేస్తున్న కేసన శంకర్రావు

ఆనందపురం : బీసీలకు ఎంతో ఉపయోగకరమైన కుల గణనను కేంద్రం చేపట్టాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకర్రావు డిమాండ్ చేశారు. మండలంలోని గంభీరంలోని ఓ ఫంక్షన్ హాలులో సోమవారం ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శంకర్‌రావు మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు జరపాలన్నారు. బీసీలను ఓటర్లుగా చూస్తున్నారు గానీ సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడుగా కర్రి ధనుంజయనాయుడు, గౌరవాధ్యక్షుడు కొమ్ము రమణమూర్తి నాయుడును సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర సంక్షేమ సంఘం యూత్ అధ్యక్షుడు కమ్మర క్రాంతి కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ని శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి పల్లి శ్రీనివాసనాయుడు, నగర అధ్యక్షుడు పల్లా రమణ పాల్గొన్నారు.

కనులపండువగా రథయాత్ర



తగరపువలస రహదారిలో సాగుతున్న రథయాత్ర

తగరపువలస: స్థానిక ప్రధాన రహదారిపై గల శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయం నుంచి వీధుల ద్వారా సోమవారం కన్నుల పండువగా రథయాత్ర సాగింది. ఈ ఆలయంలో నెల రోజులుగా అర్చకుడు రామాయణం కామేశ్వర ప్రసాదశర్మ ఆధ్వర్యంలో రోజూ మృత్తికా పార్థివ శివలింగం తయారు చేసి గోస్తనీ నదిలో నిమజ్జనం చేస్తున్నారు. చివరి కార్తీక సోమవారం సందర్భంగా మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అలాగే అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివలింగం, అయ్యప్పస్వామి, షిర్డీసాయిబాబాల విగ్రహాలను ఊరేగించారు. కార్యక్రమంలో కొప్పల రమేష్, ఉప్పల సాయిరాం, కొప్పల కృష్ణ, పోతురాజు, మొండి కృష్ణ, శివ, తెడ్లాపు చంటి తదితరులు పాల్గొన్నారు.